ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 27 జూలై 2025
5

సండే స్పెషల్
SUNDAY SPECIAL



(ఫైల్)

శుభకరం.. శ్రావణ బోనం



- ఉమ్మడి జిల్లాలో గ్రామదేవతలకు మొక్కులు
- ఊరూరా పండుగ వాతావరణం
- శ్రావణంలో బోనాలు ఇక్కడి ప్రత్యేకం

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయి బోనాలు. వాస్తవానికి తెలంగాణలో ఆషాఢమాస బోనాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం శ్రావణమాసంలోనే బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆచారంగా వస్తోంది. వర్షాలు విస్తారంగా పడే సమయంలో పంటలు బాగా పండేలా ఆశీర్వదించాలని.. ఇంటిల్లిపాదీ వ్యాధుల బారిన పడకుండా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటూ ఈ నెలలో వచ్చే ఆది, గురువారాల్లో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కొలిచి నైవేద్యం సమర్పిస్తారు. జంతు బలులు ఇస్తుంటారు. ఈ క్రమంలో ఊరి పెద్ద కాపులు మొదటి బోనం సమర్పించిన అనంతరం.. మిగిలిన వారంతా తల్లులకు బోనాలు సమర్పించే ఆనవాయితీ నేటికీ కొనసాగుతోంది. - ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురంహవేలి

7

కొత్తగూడెంలో నేడు ఉమ్మడి జిల్లా సమీక్ష

- ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి అధ్యక్షతన సమావేశం
- హాజరవనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి



ఖమ్మం, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులైన రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం తొలి సారి.. ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమావేశానికి హాజరవుతున్నారు. ఆయన అధ్యక్షతన కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగే సమీక్షకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులైన తర్వాత గతనెలలో ఖమ్మం వచ్చిన శ్రీహరి మర్యాదపూర్వకంగా భట్టిని కలిసి వెళ్లారు. ఆ తర్వాత జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించలేదు. ఆదివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్న ఈసమావేశంలో ఉమ్మడి జిల్లాలోని వర్షాలు, వరదలు, వ్యాధులపైనా ఎరువుల కొరత, తదితర సమస్యలపై చర్చించే అవకాశం ఉంది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, వానాకాలంసాగు పంటలపై, సీతారామ ఎత్తిపోతల డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులతో పాటు, గోదావరి వరదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నివేదికలు సిద్ధం చేశారు.

అభివృద్ధిలో రహదారుల పాత్ర కీలకమన్నది అందరికీ తెలిసిందే. అందుకే పట్టణాలు, గ్రామాలను అనుసంధానం చేస్తూ విశాలమైన రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వాలు దృష్టి పెడుతుంటాయి. ఈ క్రమంలోనే కేంద్రం ఇటీవల రాష్ట్రంలోని పలు జాతీయ రహదారులను విస్తరించేందుకు పచ్చజెండా ఊపింది. 1,123 కిలోమీటర్ల మేర ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న 15 రహదారులను నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు రూ.33,690కోట్ల పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ 15హైవేల జాబితాలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మూడు జాతీయ రహదారులు కూడా ఉన్నాయి.



ఉమ్మడి జిల్లాలో మూడు హైవేలకు..

మహర్దశ

రహదారుల విస్తరణకు కేంద్రం పచ్చజెండా

- రెండు నుంచి నాలుగు లైన్ల నిర్మాణానికి కసరత్తు

వైరా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని రెండు వరుసలుగా ఉన్న మూడు జాతీయ రహదారులను 300కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయనున్నారు. దాంతో ఈ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేస్తే రోడ్ల అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసే నిబంధనలు తొలగించి రాష్ట్రాల పరిధిలో ఉన్న రోడ్ల విస్తరణకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞప్తి చేసిన మేరకు మంజూరు చేయాలనే కేంద్ర నిర్ణయంలో భాగంగా జిల్లాలోని మూడు రహదారులకు మోక్షం లభించింది. ఈ రహదారుల అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని సమగ్ర నివేదికను సమర్పించాల్సి ఉంది. అన్ని వివరాలు సమగ్రంగా అందినట్లు కేంద్రం భావిస్తే వెంటనే ఆపనులకు అనుమతులు ఇచ్చి వాటికయ్యే ఖర్చును కేంద్రమే భరిస్తుంది. 2028సంవత్సరం నాటికి ఈ రోడ్ల అభివృద్ధిని పూర్తిచేయాలనే లక్ష్యంగా కేంద్రం పెట్టుకుంది.

ఉమ్మడి జిల్లాలో మహర్దశ పట్టనున్న రోడ్లు ఇవే..

ఎన్‌హెచ్ 563లో ఖమ్మం-వరంగల్ సెక్షన్‌లో 119కిలోమీటర్లు, ఎన్‌హెచ్-30లో విజయవాడ- జగదల్‌పూర్ సెక్షన్‌లో రుద్రంపూర్-భద్రాచలం వరకు, ఇందులో కొత్తగూడెం, (మిగతా 6వ పేజీలో)

జిల్లాలో ఇప్పటికే పలు జాతీయ రహదారుల నిర్మాణం...

గడిచిన ఏడెనిమిది సంవత్సరాల కాలంలో ఖమ్మాన్ని అనుసంధానిస్తూ పలు జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. వాటిలో ఇప్పటికే ఖమ్మం - సూర్యాపేట జాతీయ రహదారి పూర్తయి వినియోగంలోకి వచ్చింది. అలాగే కోదాడ నుంచి ఖమ్మం వరకు ఒక జాతీయ రహదారిని నిర్మించారు. అది కూడా అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు ఖమ్మం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలను కలుపుతూ దేవరపల్లికి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం చివరి దశలో ఉంది. అదేవిధంగా నాగపూర్ - అమరావతి రోడ్డు నిర్మాణం జరుగుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు ఖమ్మాన్ని కలుపుతూ ఈ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ రహదారులతోపాటు పైన పేర్కొన్న మూడు జాతీయరహదారులను నాలుగు వరుసలుగా నిర్మిస్తుండటంతో రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనుంది.

ఖమ్మానికి.. మరో రూ.100కోట్లు

- నివేదికలిచ్చాం.. ఆగస్టు 15లోపు తీసుకొస్తాం..
- ఏడాదిన్నరలోనే నగరంలో రూ.200కోట్ల పనులు
- విలీన డివిజన్ల అభివృద్ధికి ప్రాధాన్యం
- మహాలక్ష్మి పథకాన్ని నూరుశాతం అమలు చేస్తాం
- 3వ డివిజన్ పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం జయనగర్‌లో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర కాలంలో రూ.200 కోట్లతో ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేశామని, ఆగస్టు 15లోపు మరో రూ.100కోట్లు తీసుకొస్తామని, ఈ మేరకు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి నివేదికలు ఇచ్చామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని 3 డివిజన్‌లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో కాంగ్రెస్ నాయకుడు మలీదు మనీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో తుమ్మల మాట్లాడుతూ ఖమ్మంలో తీగల వంతెన, మోడల్ మార్కెట్ పనులు జరుగుతున్నాయని, త్వరలో ఖిల్లాకు రోప్‌వే పనులను శ్రీకారం చుడతామన్నారు. పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం రూ.200కోట్లు తీసుకొచ్చామని, అమృత్ పథకంలో మరో రూ.220 కోట్లు తాగు నీటి పథకాలకు తెప్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నిటిని అధిగమించి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అందుకు మహాలక్ష్మి పథకమే నిదర్శనమని, మహిళలకు ఆర్టీసీలో ఉచితప్రయాణం కోసం రూ.200కోట్లు వెచ్చించిందన్నారు. రేషన్‌కార్డు దారులకు, సంక్షేమ వసతిగృహాలకు సన్నబియ్యం (మిగతా 6వ పేజీలో)



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ప్రజా ప్రతినిధులు

అధికారులు.. బాధ్యతగా వ్యవహరించాలి

- ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలు సకాలంలో పూర్తి చేయాలి
- వర్షాకాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- కొత్తగూడెంలో భద్రాద్రి జిల్లా దిశ సర్వసభ్య సమావేశం

కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులు చేసిన ప్రతిపాదనలను సకాలంలో పూర్తి చేయాలని, పనులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో అందజేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సూచించారు. భద్రాద్రి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో భద్రాద్రి జిల్లా దిశా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలగుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాముకాటుకు గురయ్యే వారి కోసం యాంటీ వైరస్ మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని పట్వారిగూడెం ఆరోగ్య కేంద్ర పరిధిలో అంబులెన్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, గుండాల మండల కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు 30పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత అక్టోబర్‌లో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాగా.. నేషనల్ హైవే (మిగతా 6వ పేజీలో)

కమ్యూనిస్టులను లేకుండా చేయడం..

ఎవరి తరం కాదు

- బీజేపీది మతతత్వం.. కాంగ్రెస్‌వి బూర్జువా విధానాలు
- కగార్ పేరిట మావోయిస్టులను చంపడం దారుణం
- కమ్యూనిస్టులు లేకుంటే కాంగ్రెస్‌కు అధికారమే లేదు..
- కలుపుకొంటే ఉంటాం.. లేదంటే ఒంటరిగా పోటీ చేస్తాం..
- సీపీఐ భద్రాద్రి జిల్లా మహాసభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పు అవసరం : పువ్వాడ



అశ్వారావుపేట రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'ఒక సిద్ధాంతం లేకుండా బీజేపీ మతం పేరుతో, కాంగ్రెస్ పెట్టుబడిదారీ విధానాలతో అధికారాన్ని చేపడుతున్నాయి. వీరికి అధికార దాహం, వ్యక్తిగత అవసరాలు తప్ప మరొకటి ఉండవు. ప్రజాసమస్యలు అసలే పట్టవు.. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధాంతాలు, నిర్మాణాలు, అధ్యయనం వంటి అంశాలతో పుట్టింది సీపీఐ.. ప్రజల కష్ట సుఖాల్లో నిత్యం పాలుపంచుకుంటూ వారికి అండగా ఉంటుంది.. అలాంటి కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరి తరం కాదు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం అశ్వారావుపేటలో సీపీఐ జిల్లా మూడో మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసం తాము నిరంతర పోరాటాలు చేస్తామన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ సమ సమాజం కోసమే పుట్టిందన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే వారిని అణగదొక్కాలని చూస్తున్నారని, మావోయిస్టులను అకారణంగా చంపేస్తున్నారని, వచ్చే ఏడాది మార్చి కల్లా మావోయిస్టులను (మిగతా 6వ పేజీలో)



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు

మతతత్వానికి అండగా కార్పొరేట్ శక్తులు



- దేశానికి ప్రమాదకరంగా మారిన మోదీ పాలన
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

7



ఖమ్మంలో మున్నేరు పరవళ్లు

వర్షం.. విస్తారం

- ఉమ్మడి జిల్లాలో కొనసాగిన ముసురు
- భద్రాచలం వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం
- శనివారం రాత్రికి 35.4 అడుగులకు చేరిక
- వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- యూరియా అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే అరికట్టాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్
- జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు ఆదేశాలు

6

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పాల్వంచ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం పాల్వంచలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు)ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. భోజనశాలలో బెంచీలు లేక విద్యార్థులు అవస్థలు పడుతుండటాన్ని గమనించి త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బెస్ట్ అవుటాఫ్ వేస్ట్ కార్యక్రమంలో విద్యార్థినులు రూపొందించిన సృజనాత్మక వస్తువులను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ బాలికల విద్యను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిష్టతో పలు కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మైథిలి, ఉపాధ్యాయులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరతను పరిష్కరించాలి

» రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి వెంకటరెడ్డి

ఖమ్మం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్న యూరియా కొరతను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్న నేపథ్యంలో ఎరువులు వేసేందుకు మంచి అదునుగా ఉందన్నారు. సుమారు 8 వేల మంది రైతులు మొక్కజొన్న, వరి, మిర్చి పంటలు సాగు చేసి యూరియా కోసం ఆందోళనగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాంకోటి నాయక్, భాస్కర్, శంకర్ రెడ్డి, భాస్కరరావు తదితరులున్నారు.

వర్షం.. విస్తారం

» ఉమ్మడి జిల్లాలో కొనసాగిన ముసురు
» అయినా చెరువులకు చేరని నీరు
» ఖమ్మం జిల్లాలో 1060 చెరువులకు అలుగులు పడినవి 130

ఖమ్మం / కొత్తగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం కూడా ముసురు కొనసాగింది. మోస్తరు జల్లులు పడగా.. నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలతో విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు తమ తమ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఇళ్లకే పరిమితమవుతుండటంతో వ్యాపారాలు కొంత మేర తగ్గాయి. ఇక రైతులు సాగుపనులను ముమ్మరం చేయగా.. అక్కడక్కడ యూరియా కొరత నెలకొంది. పలు సొసైటీల వద్ద యూరియాకోసం రైతులు బారులు తీరుతున్నారు. ఖమ్మం జిల్లాలో 1,060 చెరువులకు గాను ప్రస్తుతం 130 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. ఇంకా చాలా చెరువులు నిండాల్సి ఉంది. రోజూ వర్షం పడుతున్నా చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ వానాకాలం పంటల సాగు 6,08,350 ఎకరాలు లక్ష్యంకాగా 4,80,670 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు వేశారు. ప్రధానంగా వరి 2,87,000 ఎకరాలకు గాను లక్షా 2వేల ఎకరాల్లో నాట్లు, కరివేద కింద వేశారు. పత్తి 2లక్షల20వేల ఎకరాల్లో వేశారు. తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేపట్టగా.. ఖమ్మం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సంయమనం పాటించాలని సూచించారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఖమ్మం జిల్లాలో 18.6మి.మీ. సగటు వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా సింగరేణిలో 47.8మి.మీ., కామేపల్లి 34.6 మి.మీ., రఘునాథపాలెం 18.6 మి.మీ., ఏన్కూరు 32.0మి.మీ., కల్లూరు 24.6 మి.మీ., పెనుబల్లి 25.4 మి.మీ., చొప్పున వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు 9.1అడుగుల వద్ద ప్రవహిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో 61మిల్లీమీటర్లు, టేకులపల్లి 59, పాల్వంచ సీతారాంపట్నంలో 54.5, టేకులపల్లి కోయగూడెంలో 49.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అతిస్వల్పంగా అశ్వాపురంలో 17.5 మిల్లీమీటర్ల వర్షపాతంనమోదైనట్లు అధికారులు ప్రకటించారు. భద్రాచలం వద్ద ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో పాటు తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. శనివారం ఉదయం గోదావరి 32.5 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఆదివారం ఈ ప్రవాహం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఇక దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద సీతమ్మ వారి నార చీరల ప్రాంతంలో వరద నీరు చేరడంతో పర్యాటకులను అనుమతించడం లేదు. కిన్నెరసాని రిజర్వాయర్‌కు వరదనీరు భారీగా చేరడంతో గేట్లు ఎత్తేందుకు జెన్కో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 407 అడుగుల సామర్థ్యం ఉన్న కిన్నెరసాని రిజర్వాయర్‌లో 404.60 అడుగులు నీరు చేరడంతో రెండు గేట్లు ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని శనివారం రాత్రికి దిగువకు వదిలే అవకాశం ఉన్నట్టు అధికారులు ప్రకటించా రు. గుండాల, ఆళ్లపల్లి అడవుల నుంచి వరదనీరు కిన్నెరసానికి భారీగా రావడంతో ఆళ్లపల్లి సమీపంలో ఉన్న కిన్నెరసానివాగుకు వరదనీరు పెద్దఎత్తున వస్తుండటంతో రవాణాకు అంతరాయం ఏర్పడుతుంది. సింగరేణిలోని కొత్తగూ డెం రీజియన్ పరిధిలోని జికెవోసీ, ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి ఓపెన్‌కాస్టుల్లో వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోంది. వర్షాల దృష్ట్యా ఎటువంటి ప్రాణహాని కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల ని జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ అధికారులకు సూచించారు.

తాలిపేరు ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తివేత

చర్ల,జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గడ్, చర్ల మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టులోని భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. అప్రమత్తమైన అధికారులు శనివారం ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తి 24వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భారీ వర్షాలకు ఛత్తీస్‌గడ్, చర్ల మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండు కుండని తలపిస్తున్నాయి. తాలిపేరు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పరిస్థితి అంచనా వేస్తున్న డీఈ తిరుపతి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 72.07 మీటర్లుగా ఉంది. ఇన్‌ఫ్లో 23 వేల క్యూసెక్కులని అధికారులు తెలిపారు.

భద్రాచలం వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం

భద్రాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శనివారం సాయం త్రం ఆరు గంటలకు 35.4 అడుగులకు పెరిగి నిలకడగా ఉంది. ఇది మరింత స్వల్పంగా పెరిగి కొద్దిసేపు నిలకడగా ఉండి అనంతరం తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గోదావరి నీటిమట్టం శుక్రవారం రా త్రి 9 గంటలకు 26.4 అడుగులు ఉన్న నీటి మట్టం శనివారం ఉదయం 6 గంటలకు 31.3 అడుగులకు పెరిగింది., 9 గంటలకు 33.6, 12గంటలకు 34.6., 2గంటలకు 34.9 అడుగులకు చేరుకోగా 4 గంటలకు 35.3 అడుగులు, 6 గంటలకు35.4 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. స్నానఘట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తోంది. భక్తులు, పర్యాటకులకు తెలిసేందుకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.



తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీలో యూరియాకోసం క్యూలో ఉన్న రైతులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» యూరియా అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే అరికట్టాలి
» ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్
» జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు ఆదేశాలు



సురేంద్రమోహన్ నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సురేంద్ర మోహన్ శనివారం హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, యూరియా నిల్వలు, సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు, రేషన్ కార్డులు మంజూరు, తదితర అంశాలపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు, మున్నేరు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రాణహాని జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను, ఆపదమిత్ర వలంటీర్లను అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్రంలో యూరియాకు సంబంధించి రెండు లక్షల టన్నుల దిగుమతి తగ్గిందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తగినంత యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా అధికారులు యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. వరద విపత్తుల నిర్వహణ కోసం కలెక్టరేట్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద 24 గంటల పాటు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని సురేంద్ర మోహన్‌కు వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరద ఉధృతి ప్రకారం ఏ ప్రాంతాలు ముంపుకు గురవుతాయో మ్యాపింగ్ చేశామన్నారు. ప్రస్తుతం ఖమ్మంలో మున్నేరు 7.5 అడుగులు మాత్రమే ఉందని పరిస్థితి కంట్రోల్లో ఉందని కలెక్టర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వరదల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో 8, 5 మున్సిపాలిటీలలో 13, మండల స్థాయిలో 54 రిలీఫ్ క్యాంపులు గుర్తించి అక్కడ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఖమ్మం నగరంలో 24 మంది సభ్యులతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు 4 బోట్లతో, 24 మంది సభ్యులతో 2 బోట్లతో సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

మహబూబాబాద్, వరంగల్ జిల్లాల వాతావరణ పరిస్థితులను కూడా ఎప్పటి కప్పుడు అంచనా వేస్తున్నామని, కొత్తగా 5 గేజ్ పాయింట్లను ఏర్పాటు చేసి 3 గంటలు ముందుగానే నీటి ప్రవాహ వివరాలను తెలుసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు డెంగ్యూ 16, చికెన్ గున్యా 1, మలేరియా 2 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని ప్రైవేట్ ఆస్పత్రిలో నమోదు కేసులను కూడా ఫాలో అప్ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు పకడ్బంది చర్యలు చేపట్టామన్నారు. ఈ సమీక్షలో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సీపీవో శ్రీనివాస్, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జి. పుల్లయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతను పట్టించిన గ్రామస్థులు

దుమ్ముగూడెం జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయదారుడిని డబ్ల్యుఎల్‌రేగుబల్లి గ్రామస్థులు శనివారం పోలీసులకు పట్టించారు. సరిహద్దు ఏపీ రాష్ట్రం పిచుకలపాడుకు చెందిన వ్యక్తి సుమారు 200 నాటుసారా పాకెట్లను ఒక సంచిలో తెచ్చి డబ్ల్యుఎల్ రేగుబల్లిలో విక్రయదారులకు సరఫరా చేసేందుకు బస్ దిగాడు. గమనించిన గ్రామస్థులు అతడిని పట్టుకొని పోలీసులకు ఫోన్ చేశారు. నాటుసారా ప్యాకెట్లతో సహా వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టించిన వారిలో గంట్ల సురేష్, ప్రేమ్, రాజేష్, లక్ష్మణరావు, శ్రీకాంత్‌లున్నారు.

ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి

పినపాక, 26 జూలై (ఆంధ్రజ్యోతి): ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కే మల్సూర్‌కు ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. శనివారం ఏడూళ్లబయ్యారం పీఎస్‌లో రిపోర్ట్ చేసిన ఆయన బాధ్యతలు స్వీకరించారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు మల్సూర్‌ను అభినందించారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మద్దెలకు సినారే సాహిత్య సేవా పురస్కారం



సేవా పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చుంచుపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలలో ప్రతిభ కలిగిన కళాకారుడు డాక్టర్ మద్దెల శివకుమార్ రాష్ట్రానికే గర్వకారణమని మాజీ ఛైర్మన్ మధుసూధనాచారి, ప్రముఖ సీనియర్ నటీమణి రాజశ్రీ అన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సీల్ వెల్ కార్పోరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ సినారె జయంతి ఉత్సవాలలో భలే మంచి రోజు కార్యక్రమంలో మద్దెలకు ఈ అవార్డు గ్రహీతకు జిల్లాలోని కళాకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

జూలూరుపాడులో శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

● ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖాధికారికి వినతి

జూలూరుపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులో ప్రభుత్వం కేటాయించిన భూమిలో తక్షణమే శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటుచేయాలని కోరుతూ శనివారం వివిధ పార్టీల, గిరిజన సంఘం నాయకులు ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి అలీంకు విన్నవించారు. ఖమ్మంలో కార్యాలయంలో ఆయన్ని కలసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ లేకపోడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపమార్కెట్ యార్డును ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్ల జరుపుతుండటంతో కోట్ల రూపాయాల ఆదాయం ప్రభుత్వానికి ప్రతి ఏటా వస్తున్నప్పటికి శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటుచేయడం తగదన్నారు. తక్షణమే మార్కెట్‌ను ఏర్పాటుచేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రజాపంథా మండల కార్యదర్శి బానోత్ ధర్మా, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, గిరిజన సంఘం నాయకులు బానోత్ ధర్మా, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులు.. బాధ్యతగా వ్యవహరించాలి

(5వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్లు, వంతెనల నిర్మాణాలపై అధికారులు సరైన నివేదికలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని.. కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు నియోజకవర్గ పనులపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలన్నారు. స్పందించిన ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పనులు పూర్తి చేయడంలో విఫలమైన కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పీహెచ్‌సీ భవనాలను త్వరితగతిన తొలగించి నూతన భవనాలకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీలో వేలిముద్రలు పడకుండా వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారని.. అందువల్ల ప్రతీ రేషన్ షాపులో కౌంటర్లు ఏర్పాటు చేసి రేషన్ కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం చేసి బియ్యం పంపిణీ చేసే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేయడం వల్ల రేషన్ షాపుల వద్ద ఎక్కువ సంఖ్య ఉంటుందని, దీన్ని అధిగమించడానికి రేషన్ షాపుల సంఖ్యను పెంచి నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించాలని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రతిపాదన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల మంజూరులో క్షేత్రస్థాయిలో ఆధార్ నెంబర్ తప్పుగా నమోదు చేయడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం రైల్వే, బీఎస్ఎన్ఎల్, ఉపాధి హామీ, ఇంజనీరింగ్ తదితర శాఖల ద్వారా చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమావేశంలో చర్చించారు. పాఠశాలలో ప్రహరీ నిర్మాణం ఎక్కడైతే అవసరం ఉందో.. అక్కడ నూతన పద్ధతి ద్వారా మట్టి ఇటుకలతో గోడలు నిర్మించవచ్చునని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఆర్టికల్ 279 ద్వారా భవన నిర్మాణాలు, అదనపు తరగతి గదులు, రోడ్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వారావు పేట, భద్రాచలం, పినపాక, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు ఆది నారాయణ, వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో డి రాహుల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను లేకుండా చేయడం.. ఎవరి తరం కాదు

(5వ పేజీ తరువాయి)

లేకుండా చేస్తామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. మావోయిస్టులను తుద ముట్టిస్తామని అమిత్‌షా ప్రగల్భాలు పలుకుతున్నారని, దమ్ముంటే టూరిస్టుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులను పట్టుకుని వారిపై తమ ప్రతాపాన్ని చూపాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌కు భయపడి పెద్ద బాస్ మోదీ, చిన్న బాస్ అమిషా ఆడించే ఆటలు అందరికీ తెలుసునన్నారు. ఇది హిట్లర్ పాలన కాదని, కానీ మీరంతా హిట్లర్ వారసులుగానే పాలన చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టులను అంతం చేయడం ఆనాటి నిజాం నవాబుల వల్లే కాలేదని.. ఇప్పుడు మీరెంత అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేస్తూ పాలన చేస్తున్నారన్నారు. మతోన్మాదశక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

కొందరు కాంగ్రెస్ నాయకులు పిచ్చిగా వాగుతున్నారు..

వారి వల్లే సీపీఐ గెలిచిందని కొందరు కాంగ్రెస్ నాయకులు పిచ్చివాగుడు వాగుతున్నారని, అసలు సీపీఐ లేకుంటే కాంగ్రెస్ గెలిచేదో.. లేదో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే కాంగ్రెస్‌కు అధికారమే లేదన్నారు. ఏడాదిన్నర పాటు ఓపికతో ఉన్నామని, తమ సహనాన్ని పరిక్షించవద్దని అన్నారు. కలుపుకుపోతే కలిసొస్తామని, లేదంటే తమ దారి తాము చూసుకుంటామని తెగేసి చెప్పారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలోని 118 నియోజకవర్గాల్లో కమ్యూనిస్టులు మద్దతు పలికిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సీపీఐని కాదనుకుని బీఆర్ఎస్ చిత్తుగా ఓడిపోయి ఇంట్లో కూర్చుని పశ్చత్తాపడుతోందన్నారు. ఒప్పందం కుదరకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ ఒంటరి పోటీకి సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. అనేక చారిత్రక పోరాటాలకు నేతృత్వం వహించిన పార్టీ సీపీఐ అన్నారు. మహాసభల ద్వారా భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలన్నారు.

రాజకీయాల్లో మార్పు అవసరం

సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పు అవసరమని సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక సామాజిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు జరగాలంటే ప్రస్తుత బీజేపీ పోకడలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈతరం యువత రాజకీయాల పట్ల ఆసక్తి కనబరిచిప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని సూచించారు. అనంతరం మహాసభలను ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన సయ్యద్ సలీం అధ్యక్ష ఉపన్యాసం చేశారు. మహాసభల్లో మరణించిన పార్టీ బాధ్యులు, ఇతర నేతలకు సంతాపంగా మౌనం పాటించి నివాళులు అర్పించారు. మహాసభల్లో కళాకారుల ఆటపాటలు ఎంతగానో ఉర్రూతలూగించాయి. తొలిరోజు మహాసభల సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర నేతలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల నుంచి ప్రతినిధులు భారీగా తరలి రావడంతో అశ్వారావుపేట ఎరుపుమయంగా మారింది. ఈ మహాసభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు అయోధ్య, రాష్ట్ర కంట్రోల్ కమిటీ ఛైర్మన్ మౌలానా, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, ఆహ్వాన సంఘం నాయకులు సలీం, నారాటి ప్రసాద్, దండు సురేశ్, గన్నిన రామకృష్ణతో పాటు పలు జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం



మహాసభలకు హాజరైన ప్రతినిధులు

ఖమ్మానికి.. మరో రూ.100కోట్లు

(5వ పేజీ తరువాయి)



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

పంపిణీ చేస్తున్నామన్నారు. దివంగత కార్పొరేటర్ మలీదు జగన్‌తో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని, ఆయన లేని లోటును ఆయన కుమారుడు మనీష్ తీరుస్తున్నాడని, జగన్ కోరిన అభివృద్ధిని తాను నెరవేరుస్తానన్నారు. గతేడాది వరదల సమయంలో బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య మంచిగా పనిచేస్తున్నారని, నిరుపేదలు, విలీన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినందించారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మం 3వ డివిజన్ నెంబర్1 స్థానంలో ఉంచేందుకు మనీష్ కష్టపడుతున్నాడని ఆయనకు అందరి సహకారం ఉంటుందన్నారు. మంత్రి తుమ్మల కృషితో నగరం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఒకే రోజు 3వ డివిజన్‌లో రూ.1కోటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని, రహదారులు, డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌లు అన్నిరకాల అభివృద్ధి జరుగుతోందని, ఖమ్మం నగర పాలక సంస్థ విశేషంగా కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, స్థానిక నాయకులు మలీదు నాగమణి, యాదాల చంద్రశేఖర్, మేకల నాగరాజు, చింతల వెంకన్న, గుర్రం రవీందర్, మందనపు నాగేశ్వరరావు, వరకాల ప్రసాద్, వరకాల బాబు, చాట్ల సాయి, మలీదు నరేశ్, చింతపల్లి కోటేశ్వరరావు, భార్గవ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలోని మూడు హైవేలకు.. మహర్దశ

(5వ పేజీ తరువాయి)

పాల్వంచ బైపాస్ రోడ్లకు అనుసంధానం మొత్తం 100కిలోమీటర్లు. ఎన్‌హెచ్365బీబీలో ఖమ్మం-సత్తుపల్లి మార్గంలో 81కిలోమీటర్ల రెండు వరుసల రోడ్లను నాలుగు వరుసలుగా రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2002 ప్రాంతంలో కేంద్రంలోని వాజపేయి ప్రభుత్వం దేవరపల్లి నుంచి సత్తుపల్లి, ఖమ్మం మీదుగా వరంగల్ వరకు ఏడుమీటర్ల రోడ్డును పది మీటర్లుగా అభివృద్ధి చేశారు. అలాగే విజయవాడ-జగదల్‌పూర్ సెక్షన్‌లోని రుద్రంపూర్-భద్రాచలం మధ్య రోడ్డును కూడా అభివృద్ధి చేశారు. ఇప్పుడు మళ్లీ మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్లను నాలుగు వరుసలు రోడ్లుగా నిర్మించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

శుభకరం.. శ్రావణ బోనం

ఉమ్మడి జిల్లాలో గ్రామదేవతలకు మొక్కులు

ఊరూరా పండుగ వాతావరణం

శ్రావణంలో బోనాలు ఇక్కడి ప్రత్యేకం



శ్రావణ బోనాలకు ముస్తాబైన ఖమ్మంలోని ముత్యాలమ్మ ఆలయం

ఖమ్మం, ఖానాపురం హవేలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలను తెలంగాణ వ్యాప్తంగా ఆషాఢ మాసంలో నిర్వహిస్తుంటారు. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం శ్రావణమాసంలోనే గ్రామదేవతలకు సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. వర్షాలు విస్తారంగా పడే సమయంలో పంటలు బాగా పండేలా ఆశీర్వదించాలని.. ఇంటిల్లిపాదీ వ్యాధుల బారిన పడకుండా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటూ ఈ నెలలో వచ్చే ఆదివారాల్లో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో శ్రావణమాసంలో వచ్చే ఆదివారాల్లో గంగమ్మ, పోచమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లులకు చేసే బోనాల వేడుకలతో పల్లె, పట్నంలో సందడి కనిపిస్తుంది. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో జిల్లా ప్రజలు ఆనందడోలికల్లో మునిగి తేలుతారు. ఉమ్మడి జిల్లాలోని పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం, ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ ముత్యాలమ్మఆలయం, వరదయ్య నగర్‌లోని మైసమ్మ తల్లి ఆలయం, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంతో పాటు పలు గ్రామదేవతల ఆలయాల్లో శ్రావణమాస బోనాలను ప్రతీ ఆదివారం, గురువారం సమర్పిస్తారు.

ఊరూరా జాతర...

ఆషాఢం నుంచి శ్రావణ మాసందాకా గ్రామాలు, పట్టణాల్లో బోనాల జాతర కొనసాగుతుంది. ఏ గ్రామంలో చూసినా పచ్చని మామిడి తోరణాలు, రంగుల సున్నాలతో అలంకరించిన ఇంటి పరిసరాలు, బంధువుల రాకతో ఇళ్లు కళకళలాడుతాయి. ఆదివారం, గురువారం రోజుల్లో బోనాలను అమ్మవార్లకు సమర్పిస్తారు. రెండురోజులు అమ్మవారికి ఇష్టమైన రోజులు. కొన్ని ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో పండుగను నిర్వహిస్తారు. అమ్మవారికి బోనాలను సమర్పించే సమయంలో గ్రామానికి సంబంధించిన భవిష్యవాణిని వినిపిస్తారు. ఊరు శివారులో ఉన్న ఆలయాలు, అటవీ ప్రాంతాల్లో సంబురాలు చేసుకొని వంటలు వండుకుని విందు భోజనాలు చేస్తారు. పూర్వం వానకాలంలో వానలు బాగా కురిసేవి. పారిశుధ్య నిర్వహణ లేక గ్రామాల్లో కలరా, ప్లేగు, తట్టు, మశూచి లాంటి అంటువ్యాధులు, భయంకర రోగాలు వ్యాపించేవి. దాంతో భయంతో ప్రజలు శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కాపాడమని కొలిచేవారు. పిల్లాపాపలను, గొడ్డూగోదను, పంటలతో పాటు ఊరు మొత్తానికి కాపలా కాయాలని మొక్కులు చెల్లించేవారు. ఊరంతా ఒకే రోజున పసుపు అన్నంతో బోనం చేసి అమ్మవారికి సమర్పించేవారు. దుష్టశక్తులను పారదోలాలని దున్నపోతులను బలిచ్చేవారు. ఇప్పుడు మేకలు, గొర్రెలు, కోళ్లను బలిస్తున్నారు.

మట్టి పాత్రలో నైవేద్యం

గ్రామ దేవతకు కొత్త మట్టిపాత్రతో నైవేద్యం (బోనం) సిద్ధం చేయాలి. ఇందుకోసం పండుగ రోజు తెల్లవారుజామునే మహిళలు భక్తిశ్రద్ధలతో కొత్త పాత్రలు తెచ్చి నైవేద్యం వండుతారు. కట్టెల పొయ్యిమీదే బోనం వండాలనే ఆచారం అనాదిగా ఉంది. వండిన తర్వాత ఆ పాత్ర చుట్టూ శుభ్రం చేసి పసుపు, కుంకుమ, సున్నం బొట్లు పెట్టి పువ్వులు, వేపకొమ్మలతో అలంకరించి దీపం వెలిగిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయా గ్రామాల పెద్ద కాపులు మొదట బోనం సమర్పించిన అనంతరమే మిగిలిన వారు బోనాలు సమర్పించేవారు. ఆ ఆనవాయితీ నేటికీ కొనసాగుతోంది. కొత్తగా పెళ్లైన దంపతులు తప్పకుండా శ్రావణ బోనాలు సమర్పించడం ఇక్కడి సంప్రదాయం.

పోతరాజు..

గ్రామదేవతకు సోదరుడైన పోతరాజును ప్రతిబింబించే వ్యక్తి బోనాల పండుగను జరిపిస్తాడు. పోతరాజు పాత్రను పోషించే వ్యక్తి ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాలికి గజ్జెలు, ఎర్రని ధోవతి ధరించి వేపాకులను నడుముకు చుట్టుకొని కొరడాతో విన్యాసాలు ప్రదర్శిస్తాడు. బోనంతో వచ్చే మహిళలను అమ్మవారి సమక్షానికి తీసుకెళ్తాడు. ఆలయం వద్దే తన దంతాలతో మేకపోతును కొరికి తలా మొండాన్ని వేరుచేసి అమ్మవారికి సమర్పిస్తాడు. అమ్మవారికి బోనంతోపాటు శాకను సమర్పిస్తారు. వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా శాకను తయారు చేస్తారు. చిన్న మట్టిపాత్రలో నీళ్లు పోసి చక్కెర లేదా బెల్లం వేసి తయారు చేస్తారు.అందులో వేపకొమ్మలు ఉంచి బోనంపై పెట్టుకొని ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పిస్తారు. కొన్ని చోట్ల కల్లుతో శాక చేసి గ్రామదేవతకు ముట్టజెబుతారు. తర్వాత ఇంటిల్లిపాదీ తీర్థంలా తీసుకుంటారు.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

రైల్వేలైన్ పనులు సాగేలా చూడాలి

కలెక్టర్‌ను కోరిన బీటీపీఎస్ సీఈ బిచ్చన్న



కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు చెక్కును అందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ రైల్వేలైన్ పనులు త్వరితగతిన ముందుకు సాగేందుకు భూ సేకరణలో ఇబ్బందులు లేకుండా చొరవ చూపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను బీటీపీఎస్ సీఈ బిచ్చన్న కోరారు. శనివారం అధికార బృందంతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. రైల్వేలైన్ కోసం సేకరించిన భూములు ఎటువంటి విభేదాలు లేకుండా తమకు అప్పగించేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్థానికంగా ఉన్న కొంతమంది రైతులు జిల్లా, హైకోర్టులను ఆశ్రయించడంతో దీనికి సంబంధించిన కేసుల విషయాలపై కలెక్టర్ దృష్టికి సీఈ తీసుకెళ్లారు. రైల్వేలైన్ నిర్మాణానికి రెవెన్యూ పరంగా అడ్డంకులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నట్లు బీటీపీఎస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసిత గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నిమిత్తం రూ.86 లక్షల సీఎస్ఆర్ చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ సివిల్ రాంప్రసాద్, ఈఈ సివిల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మతతత్వానికి అండగా కార్పొరేట్ శక్తులు

దేశానికి ప్రమాదకరంగా మారిన మోదీ పాలన

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపణ



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ మతతత్వ విధానాలకు కార్పొరేట్ శక్తులు అండగా నిలబడుతున్నాయని, పదేళ్ల పాలనలో మోదీ అటు పార్టీ.. ఇటు ప్రభుత్వ పాలనా నిర్మాణం చేశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. శనివారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.విక్రమ్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేశారని, ముఖ్యంగా రైల్వే, రక్షణ, విద్య, వైద్య, బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారని ఆరోపించారు. కార్మిక చట్టాలను సవరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చారని విమర్శించారు. బీజేపీ మతతత్వ విధానాలను కార్పొరేట్ శక్తులకు బాహాటంగా సమర్థిస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మనువాద సిద్ధాంతాలను అమలు చేస్తున్నారని, ఇటు తెలంగాణ రాష్ట్రంలోనూ అధికారంలోకి రావటానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కొందరు కేంద్ర మంత్రులు పలు అంశాలపై ద్వంద్వ వైఖరితో మాట్లాడుతున్నారని, కేంద్రంలోని బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు రూపొందించాలని పిలుపునిచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, తుమ్మ విష్ణువర్ధన్, బండారు రమేశ్, జబ్బార్, ఎస్ నవీన్‌రెడ్డి, మీరా సాహెబ్, భూక్య శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కల సాకారం.. భట్టే మా దైవం!

డిప్యూటీ సీఎం చిత్రపటంతో ఇంటికి శంకుస్థాపన

అభిమానం చాటుకున్న బస్వాపురానికి చెందిన కుటుంబం



ఇంటి భూమిపూజ కార్యక్రమంలో భట్టి చిత్రపటంతో సమీనా దంపతులు

చింతకాని, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పక్కా ఇల్లు లేక.. నివాస యోగ్యం కాని పెంకుటిల్లులో జీవిస్తూ ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవడం ఎంతో ఊరటనిచ్చింది. అందుకు కారణమైన తమ నాయకుడిని దైవంలా భావించి ఇంటి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన చిత్రపటం పెట్టుకుని అభిమానాన్ని చాటుకుంది ఆ కుటుంబం. చింతకాని మండలం బస్వాపురం గ్రామానికి చెందిన సయ్యద్ సమీనాది నిరుపేద కుటుంబం. భర్త, ఇద్దరు పిల్లలు, అత్తమామలతో కలసి చిన్న పెంకుటింట్లో నివసిస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూం ఇల్లు కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. ఎన్నికల ప్రచార సమయంలో తమ గోడును భట్టికి చెప్పుకోవడంతో.. తాము అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని భట్టి వారికి హామీ ఇచ్చాడు. ఆ హామీ ప్రకారం సమీనా కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారు డిప్యూటీ సీఎం భట్టి. దాంతో ఆయనకు కృతజ్ఞత తెలుపుతూ సమీన కుటుంబం శనివారం జరిగిన తమ ఇంటి శంకుస్థాపన కార్యక్రమంలో దేవుడి ఫొటోస్థానంలో భట్టి చిత్రపటాన్ని ఉంచి అభిమానాన్ని చాటుకుంది. కార్యక్రమాల్లో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, బందెల నాగార్జున, కుక్కల గోపి, షాజాహాన్, ఉస్మాన్, పాండురంగారావు పాల్గొన్నారు.

అక్రమంగా మామిడి చెట్ల నరికివేత

ఓ ఫైనాన్స్ వ్యాపారి ఆగడాలు

న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు



ఫైనాన్స్ వ్యాపారి అనుచరులతో మామిడి చెట్లు నరికినట్లు తెలుపుతున్న బాధితులు

కల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో చంద్రుపట్ల గ్రామంలో ఓ ఫైనాన్స్ వ్యాపారి శనివారం (సెల్ రిజిస్ట్రేషన్ గల భూమిపై) ఓ మామిడి తోటలో అక్రమంగా తన అనుచరులతో ప్రవేశించి దౌర్జన్యంగా విలువైన మామిడి చెట్లు నరికించిన సంఘటన వెలుగు చూసింది. ఈ ఘనటపై సదరు తోట యాజమాని మానాల రవికుమార్, యశోద కళ్యాణి దంపతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరు పట్టణానికి చెందిన ఓ ఫైనాన్స్ వ్యాపారి వద్ద 2014వ సంత్సరంలో చంద్రుపట్ల గ్రామంలోని సర్వే నెం : 87/ఉ/అ/ఆ ప్రకారం 13 గుంటల మామిడి తోటను తమ అవసరాల నిమిత్తం రూ.3.50 లక్షలకు సెల్‌రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు ఇచ్చాడని బాధితులు తెలిపారు. ఇలా ఇరువురు మధ్య కుదిరిన ఒప్పదం ప్రకారం నగదును వడ్డీతో సహా చెల్లించేందకు సిద్ధం కాగా.. ఫైనాన్స్ వ్యాపారి వడ్డీ కింద తీసుకున్న నగదుతో పాటు వడ్డీకి ఆ భూమి విలువ సరిసమానమంటూ మా భూమిని అక్రమించుకునుందుకు సిద్ధమైయ్యాడని వివరించారు. ఫైనాన్స్ వ్యాపారి వద్దకు పలుమార్లు ఫైనాన్స్ కింద తీసుకున్న నగదుతో పాటుగా వడ్డీ చెల్లించేందుకు వెళ్లగా అందుకు నిరాకరిస్తూ ఆ భూమి తమదేనని సదరు ఫైనాన్స్ వ్యాపారి పలు విధాలుగా తమపై వేధింపులకు పాల్పడినట్లు బాధితులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం తమ మామిడి తోటలో ఫైనాన్స్ వ్యాపారి అనుచరులతో ప్రవేశించి అక్రమంగా చెట్లు నరికించాడని ఆవేదన వ్యక్తంచేశారు. తనఖా కింద తీసుకున్న నగదు వడ్డీతో సహా కలిపి చెల్లించకపోతే ఆ భూమి స్వాధీన పరుచుకుంటానని వ్యాపారి బెదిరిస్తున్నట్లు బాధితులు తెలిపారు. వేధింపులకు గురిచేస్తున్న వ్యాపారి నుంచి న్యాయం చేయాలని వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం.. వ్యక్తి అరెస్టు

బూర్గంపాడు, జూలై 26: వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి యత్నించిన ఘటనపై శుక్రవారం బూర్గంపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం విధితమే. అత్యాచారయత్నానికి యత్నించిన ఆటోడ్రైవరును శనివారం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు వద్ద శనివారం బూర్గంపాడు ఎస్ఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న ఓ ట్రాలీ ఆటోడ్రైవరు అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా పాల్వంచలోని వెంగళరావు కాలనీకి చెందిన బాదవత్ శంకర్‌గా గుర్తించారు. అతడిని ప్రశ్నించగా శుక్రవారం తెల్లవారుజామున వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి యత్నించినట్లు తెలిపాడు. దీంతో అతనిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

తల్లాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో ఇంటిస్థలం సరిహద్దు విషయంలో జరిగిన వివాదం సందర్భంగా శెట్టి లక్ష్మీనారాయనను హత్యచేసిన నిందితుడు సుంకర శివను శనివారం అరెస్టుచేసినట్టు వైరా సీఐ ఎన్.సాగర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 19న లక్ష్మీనారాయణ తలపై ఇనుపరాడ్డుతో శివ కొట్టడంతో.. చికిత్స పొందుతూ 23వ తేదీన లక్ష్మీనారాయణ మృతి చెందాడు. దీంతో ఆయన భార్య పావనిరాణి ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదు చేసి నిందితుడు శివను మల్లారం క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాల్వంచ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మైనింగ్ మాధారంకు చెందిన తూరపాటి రాజు(30) పాల్వంచ మండలం బసవతారకకాలనీలో తాత్కాలికంగా నివాసం ఉంటున్నాడు. పాల్వంచ పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ గ్యాస్‌స్టౌవ్‌లు రిపేరు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పాల్వంచలో శనివారం మధ్యాహ్నం పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. బసవతారకకాలనీ సమీపంలోకి చేరుకోగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అతను రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత



మృతిచెందిన ఆవును చూపుతున్న రైతు

అశ్వారావుపేట రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. మున్సిపాలిటి పరిధిలో గుర్రాలచెరువు గ్రామానికి చెందిన ఎర్రబోయిన వెంకన్న బాబు అనే రైతుకు చెందిన ఆవు మేతకు వెళ్లే క్రమంలో విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా ఉన్న తీగకు తాకడంతో దానికి విద్యుత్ సప్లయి కావడం అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు మృతితో రూ.నలభై వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

సుందరయ్యనగర్‌లో చోరీ

మధిర రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మధిరలోని సుందరయ్యనగర్ ఆర్వోలైన్‌లో శుక్రవారం రాత్రి దొంగలు ఓ ఇంట్లో చోరీచేశారు. చెరుకూరి నాగేశ్వరరావు కుటుంబసభ్యులు ఇంటికి తాళంవేసి రెండునెలల క్రితం అమెరికా పర్యటనకు వెళ్లారు. దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా, కబోర్డులో దుస్తులను చిందరవందరంగా పడేశారు. ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో దుస్తులను అక్కడే పడవేసి వెళ్లిపోయారు.

వడ్డీ వ్యాపారిపై కేసు..

రూ.90 లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలు, నాలుగు కార్లు స్వాధీనం

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం : కల్లూరు ఏసీపీ రఘు



వడ్డీ వ్యాపారి నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

కల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో ఎలాంటి అనుమతిలేకుండా వడ్డీ వ్యాపారానికి పాల్పడుతున్న ఓ వడ్డీ వ్యాపారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదు అయ్యింది. అంతేకాకుండా సదరు వడ్డీ వ్యాపారి తనఖాలో పెట్టుకున్న రూ.90లక్షల విలువగల 15 ద్విచక్రవానాలు, 4 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరు పట్టణంలో మహమ్మద్ హబీబ్ అలియాస్ వడ్డీ బాబా ఎలాంటి అనుమతులు లేకుండా సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలను అవకాశంగా చేసుకుని వారి వాహనాలను తనఖా పెట్టుకుని నగదును వడ్డీకి ఇస్తుంటాడు. ఇతను అధిక వడ్డీ రేట్లకు (సుమారు రూ.10) వస్తువులను తాకట్టు పెట్టుకుని బాధితులను పీడిస్తున్నట్లు పోలీసులు వివరించారు. ముందుగా బాధితులతో మాట్లాడుకున్న నిబంధనలను కూడా ఉల్లంఘించి మోసం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఉన్నత అధికారుల నుంచి అందిన ఆదేశాలతో మేరకు వడ్డీ వ్యాపారి హబీబ్ ఇంటి వద్ద తనిఖీ చేయగా రూ.90 లక్షల విలువ గల 15 ద్విచక్రవాహనాలు, 4 కార్లను జప్తు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీలకు తాకట్టు వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరం. కాబట్టి సదరు వ్యాపారి హబీబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హరిత తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం కల్లూరులో ఏసీపీ రఘు సమక్షంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగయ్య, ఎస్ఐ హరితలు వడ్డీ వ్యాపారి ఇంటి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

కల్లూరు ఏసీపీ రఘు

కల్లూరు ప్రాంతంలో అనుమతులు లేకుండా ఎవరైన అధిక వడ్డీ వ్యాపారానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏసీపీ రఘు చెప్పారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అధిక వడ్డీలకు తాకట్టు వ్యాపారం చేసేవారి వివరాల సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవటమే కాకుండా, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

దుమ్ముగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా.. బట్టిగూడెంకు చెందిన మల్లం లలిత(25)కు చర్ల మండలం బోదపల్లి గ్రామానికి చెందిన కణితి గంగరాజుతో పదేళ్ల క్రితం వివాహం వీరికి ఇద్దరు సంతానం. కాగా గత రెండేళ్ల నుంచి భర్తతో గొడవలు జరుగుతుండడతో లలిత బట్టిగూడెంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 20వ తేదీన భర్త దగ్గరకు వెళ్లి కలిసి ఉండాలని లలిత అక్క, తల్లిద్రండులు మందలించారు. దీంతో మస్తాపానికి గురైన లలిత పురుగుల మందు తాగింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను తొలుత భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఈ నెల 22న కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించగంతో ఆమె శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచారంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

దుమ్ముగూడెం జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడికుడిలో ఓ మానసిక వికలాంగురాలిపై అత్యాచారం జరిగిన ఘటనపై ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి శనివారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేని ఆ యువతిపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారం చేయడంతో ఆమె గర్భం దాల్చింది. పరీక్షలు నిర్వహించగా బాధిత యువతి ఎనిమిది నెలల గర్భిణీ అని తెలిసింది. దీనికి కారణమైన వ్యక్తిని గుర్తించి చట్టపరమైన చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ వెంట నరసాపురం సెక్టార్ సూపర్‌వైజర్ సహనా, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక వ్యక్తులపై నిఘా పెట్టాలి

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు

చుంచుపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

జిల్లాలోని పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, కమ్యూనిటీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు శనివారం కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలను అరికట్టే అవకాశం ఉందన్నారు. ఇందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దూర ప్రయాణాలు చేసేటప్పుడు ఇళ్లలో విలువైన వస్తువులను ఉంచకూడదని, అదే విధంగా ఇరుగు పొరుగు వారికి, స్థానిక పోలీసులకి సమాచారం అందించాలన్నారు.

పోడుదారులు, అటవీ అధికారుల మధ్య వివాదం

కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో ఘటన

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరు వర్గాలు

కొణిజర్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోడు సాగుదారులు, అటవీ అధికారులకు మధ్య వివాదం నెలకొన్న సంఘటన కొణిజర్ల మండలం గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలో శనివారం జరిగింది. ఈ వివాదంపై ఇరువర్గాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా అటవీ ప్రాంతంలో పోడు సాగు చేస్తుండగా వెళ్లామని ఫారెస్ట్ అధికారులు చెబుతుండగా.. గతంలో ఉన్న భూమిలోనే పత్తి సాగు చేయగా.. మొక్కలను ఫారెస్ట్ అధికారులు తొలగించారని ఎల్లన్ననగర్ గ్రామానికి చెందిన శ్రీను అనే రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదులపై విచారణ చేస్తామని ఎస్ఐ సూరజ్ తెలిపారు. గుబ్బగుర్తి అటవీ ప్రాంతం ఎల్లన్ననగర్ గ్రామ ప్రాంతంలోని సాగర్ ప్రధానకాల్వ పక్కన పోడుభూమి ఉండగా.. ఎల్లన్ననగర్‌కు చెందిన రైతులు, ఇతర గ్రామాల రైతులు గతంలో భూమిని చదును చేసి సాగు చేస్తున్నారు. గతంలో ఎల్లన్ననగర్‌కు చెందిన పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఆ ఘర్షణ సమసిపోయిందనుకున్న సమయంలో మళ్లీ వివాదం మొదలైంది. శుక్రవారం సెక్షన్ పరిధిలోని సెక్షన్ ఆఫీసర్ ఉపేంద్రయ్య, బీట్ ఆఫీసర్ విజయ, అటవీ సిబ్బందితో కలిసి కొత్తగా పోడు నరుకుతున్నారన్న సమాచారంతో అక్కడకు వెళ్లి పరిశీలించారు. అక్కడ రైతులు కొత్తగా పోడును నరకలేదని వాగ్వాదానికి దిగారు. రైతుల్లో శ్రీను అనే వ్యక్తి కొత్తగా పోడునరకలేదని తన భూమిలోనే ఫారెస్ట్ అధికారులు సాగు చేసిన పత్తి మొక్కలను పీకేశారని ఫిర్యాదు చేశారు. బీట్ ఆఫీసర్ విజయ తమ విధులకు అటంకం కలిగిస్తూ పోడును నరుకుతున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వివాదం చినికిచినికి గాలివానలా మారకముందే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. పోడు రైతులు ఎవరైనా కొత్తగా అడవి జోలికి వెళ్లొద్దని సెక్షన్ ఆఫీసర్ ఉపేంద్రయ్య కోరారు.

సంస్థాగత ఎన్నికల్లో బీసీలకు పెద్ద పీట

ఖమ్మం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రానున్న సంస్థాగత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బీసీలకు పెద్ద పీట వేయనున్నట్లు టీడీపీపార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్, పాలేరు బాధ్యులు మల్లెంపాటి అప్పారావులు అన్నారు. శనివారం మండల పరిధిలోని గోళ్లపాడు గ్రామంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు కొప్పుల నాగేశ్వరరావు, సుందర్ రాంరెడ్డి, సానబోయిన గోపి, సైదులు, పలసం వెంకటేశ్వర్లు, సుధాకర్, ప్రసాద్, వీర్యా, మల్లెంపాటి లెహరీన్, నాగేశ్వరరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురం సొసైటీ గోదాం తనిఖీ



యూరియాను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

ఖమ్మం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం సహకార సంఘం ఆధ్వర్యంలోని యూరియా గోదాంపై జిల్లా వ్యవసాయాధికారి జి.పుల్లయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో ఉన్న యూరియా నిల్వల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ జిల్లాలో రైతులకు కావాల్సిన యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని తెలిపారు. లేనిపోని అపోహలకు పోయి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయవద్దని సూచించారు. రెండు, మూడుసార్లు నానో యూరియా ద్వారా నత్రజని అందజేయవచ్చన్నారు. తగినంత మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని ఎక్కువగా వాడితే భూసారం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమా నగేష్, సీఈవో మహమూద్ అలీ పాల్గొన్నారు.

మంచుకొండ ఎత్తిపోతల పథకం వద్ద అన్నదాతల క్షీరాభిషేకం

రఘునాథపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషమైన కృషితో మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తి కావడంతో మండలంలోని 33 చెరువులకు సాగునీటి కాలం వచ్చిందని ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు పేర్కొన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకానికి నూతనంగా మూడు ఆధునిక మోటర్లు బిగించి ట్రయల్ రన్ నిర్వహించడంతో వారు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ తాతా రఘురాం, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, కేలోత్ దేవ్‌సింగ్, బండి నాగేశ్వరరావు, లాల్‌నాయక్, నర్సిరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

» వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం, జూలై26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం తిరుమలాయపాలెంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన వ్యకాసం మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ తప్పుడు విధానాలతో దేశం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. ఈసమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సంద్రప్రసాద్, ఎ.నరసయ్య, వెంకటరామిరెడ్డి, బింగి రమేష్, వెంకన్న, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

» ఎస్జీపీఏటీ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య

ఖమ్మం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జీపీఏటీ)ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం కృషిభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తెచ్చిన చట్టంతో భవిష్యత్‌లో పెన్షనర్ల భద్రతకు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఏడి కోటేశ్వరరావు, విశ్రాంత మండలవిద్యాధికారి దుగ్గినేని శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భాస్కరాచారి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, శరత్‌బాబు, వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, ప్రసాదరావు, రామనాథం, గుర్రాల శ్రీనివాసరావు, ప్రకాష్, కామారపు శ్రీనివాసరావు, మధుకర్‌రెడ్డి, లక్ష్మయ్య, కంచుమర్తి పుల్లయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి

నేలకొండపల్లి, జూలై26(ఆంధ్రజ్యోతి): నాట్లు ముమ్మరంగా సాగుతున్న వేళ రైతులకు ఎరువులు ముఖ్యంగా యూరియా కొరత లేకుండా చూడాలని తెలుగుదేశం జిల్లా నాయకుడు ఆరెకట్ల కొండలరావు డిమాండ్ చేశారు. శనివారం నేలకొండపల్లి రామాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సూరపనేని రామకృష్ణ, వీసం శ్రీనివాసరావు, కోలేటి మస్తాన్‌రావు, నలమాస మల్లయ్య, అక్కినేని నాగేశ్వరరావు, వంకాయలపాటి పద్మ, కారంగుల వీరబాబు, ఎర్రా రవీందర్, మంకెన నాగార్జున, అల్లు రాజేందర్, నూక హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఆయన కుమారుడు దౌర్జన్యం చేశారని ఫిర్యాదు

ఖమ్మం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీఐ, ఆయన కుమారుడు దౌర్జన్యం చేశారని ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ నందు ఓ వ్యక్తి శనివారం రాత్రి ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం నగరంలోని కవిరాజ్‌నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వేముల గణేష్ అనే వ్యక్తి అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ కమిషనరేట్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న నూనె వెంకటేశ్వర్లు, పెద్ద కుమారుడు వాచ్‌మెన్ గణేష్‌ను తిడుతూ దాడిచేశాడు. ఎందుకు దాడిచేస్తున్నాడని వాచ్‌మెన్ భార్య, మనవరాలు వచ్చి అడుగగా వారిని కూడా దుర్భషలాడుతూ తిట్టాడు. కొద్దిసేపటి తరువాత సీఐ వెంకటేశ్వర్లు, ఆయన భార్య కూడా వచ్చి బూతులు తిడుతూ దౌర్జన్యం చేశారని గణేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బాధితుడు న్యాయం చేయాలని ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నియామకం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వంశరాజ్ కులసంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ సంక్షేమ కార్యదర్శిగా ఖమ్మం పట్టణానికి చెందిన కర్నె సరోజ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని ఆమెకు ఆసంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇరిగిజ్ఞ మురళీకృష్ణ అందజేశారు. ఈసందర్భంగా సరోజ మాట్లాడుతూ రాష్ట కమి టీ సలహాలు, సూచనలతో పనిచేస్తానని, సంఘ ఆశయాలకు కట్టుబడి ఉంటూ పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.

నెల రోజుల్లో నగరంలో సమూల మార్పులు రావాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కార్పొరేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో నెల రోజుల్లో సమూల మార్పులు రావాలని కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి అన్నారు. శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖమ్మం నగరంలో పారిశుధ్య కార్యక్రమాన్ని కలెక్టర్ కమిషనర్ వచ్చి నేరుగా పర్యవేక్షణ చేయరని, అసిస్టెంట్ కమిషనర్, పారిశుధ్య పర్యవేక్షకులు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎవ్వరూ చేయాల్సిన బాధ్యతలు వారు వ్యక్తిగత శ్రద్ధతో పనిచేస్తే పారిశుధ్యంతో పాటుగా ఖమ్మం నగర అభివృద్ధి అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుందని అన్నారు. ఒక అభివృద్ధి పని టెండర్ పూర్తి జరిగి ఆగ్రిమెంట్ అయ్యాక నెల రోజుల వ్యవధిలోనే పనులు ప్రారంభం కావాలని, ఒకే కాంట్రాక్టర్‌కు అనేక పనులు ఇవ్వడం ద్వారా కూడా పనులు జాప్యం జరుగుతున్నాయన్నారు. ఆలస్యంగా పనులు ప్రారంభించినా లేదా త్వరగా పనులు పూర్తి చేయకుంటే ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లీస్టులో పెట్టాలని ఆదేశించారు. వేగంగా అభివృద్ధి జరుగుతున్న ఖమ్మం నగరంలో ఆ మేరకు రెవెన్యూ వసూళ్లు చేపట్టాలని డిసెంబర్ వరకు ఏడాది ఆదాయ వసూళ్లు పూర్తి చేయాలని కోరారు. అమృత్ పథకంలో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులను వేగవంతంగా జరపాలని ఆదేశించారు. ఖమ్మం నగరంలో రూ.105 కోట్లతో 388 అభివృద్ధి పనులు చేపట్టగా వాటిలో 190 పనులు పూర్తి జరిగాయని, 112 పనులు పురోగతిలో ఉన్నాయని, ఇంకా 30 పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. ఖమ్మం నగరంలో నెల రోజుల్లో స్పష్టమైన మార్పులు కనిపించాలన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ విభాగాల వారీగా చేపట్టిన పనులను, కార్యాచరణను వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఏసీపీ గంధం వసుంధర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, ఈఈ కృష్ణలాల్, ఎస్ఈ రంజిత్, డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియాన్ని సందర్శించిన కలెక్టర్

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియాన్ని శనివారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎనిమిది వరసల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌తో పాటు నిర్మాణ దశలో ఉన్న టేబుల్ టెన్నీస్ ఇండోర్ హాలు పనులను పరిశీలించారు. సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించి క్రీడాకారులకు అతి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సింథటిక్ ట్రాక్ మధ్యలో హాకీ తదితర క్రీడా వసతులు ఏర్పాటుపై తగు సూచనలు చేశారు. స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన మౌలిక వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, స్టేడియం మేనేజర్ ఉదయ్‌కుమార్, అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ గౌస్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం స్థాపించి 50ఏళ్లు అయిన సందర్భంగా శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్‌లోని క్లబ్ కార్యాలయంలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా 50 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వారికి చీర, రవిక, పూలు, పండ్లు, స్వీట్లు తదితర సామగ్రి అందించి సన్మానించారు. నగరమేయర్ పూనకొల్లు నీరజ, క్లబ్ అధ్యక్షుడు, రొటేరియన్ వల్లభినేని రామారావు, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య హాజరై మాట్లాడారు. అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ పి. మహాలక్ష్మి ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశించి గురించి మాట్లాడారు. డాక్టర్ బి. శ్రీదేవి ఎండీజీవో గర్భిణులు తీసుకో ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పాపారావు, కార్యదర్శులు: దొడ్డపనేని సాంబశివరావు, బి. సుధాకర్, కోశాధికారి పాలడుగు నాగేశ్వరరావు, వనుమర్తి రంగారావు, ఐ.రామకృష్ణ, మేకల భిక్షమయ్య యన్. రవీంద్రనాధ్ ఇతర రోటేరియన్స్, ఇన్నర్ వీల్ సభ్యులు పాల్గొన్నారు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న మేయర్, క్లబ్ సభ్యులు

ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నర్వనేని



ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై26 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా నర్వనేని వెంకట్రావును ఎంపిక చేసినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత స్వరాష్ట్రంలో ఐజేయూ అనుబంధ టీయూడబ్ల్యూజేలో వెంకట్రావు పలు పదవులు నిర్వర్తించిన అనుభవంతో రాష్ట్ర కౌన్సిల్‌కు ఎంపికచేశామన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి

» డీఎల్‌పీవో రాంబాబు

నేలకొండపల్లి, జూలై26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు ఆదేశించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్య పనులను ఎంపీడీఓ మర్రి ఎర్రయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశాలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిత్తడి రోడ్డుపై నాటేసి నిరసన

» రైల్వేకాలనీ, విద్యానగర్‌లో మాస్‌లైన్ నాయకుల పర్యటన



రోడ్డుపై నాటేసి నిరసన తెలుపుతున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఒకటో డివిజన్ కైకొండాయిగూడెం పరిధిలోని రైల్వేకాలనీ, విద్యానగర్‌లలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వానలకు చిత్తడిగా మారి నడవడానికి కూడా వీల్లేకుండా ఉన్నాయని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం వన్ టౌన్ కార్యదర్శి జె లెనిన్ అన్నారు. శనివారం రైల్వేకాలనీ, విద్యానగర్‌లోని బురదమయమైన రోడ్లను ఆ పార్టీ నాయకులు పరిశీలించి.. వరి నాటు వేసి నిరసన తెలిపారు. మంత్రులు, మేయర్, కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి రోడ్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేదంటే స్థానికులతో కలిసి త్వరలోనే కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో మాస్ లైన్ నాయకులు కె.శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, ములకలపల్లి లక్ష్మీనారాయణ, జిక్కుల భరత్, ధరణ్ కృష్ణ, బొమ్మకంటి రమేష్, కాటబోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కులపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ

» ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్ ప్రభాకర్

ఖమ్మం మార్కెట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాల పట్ల కాంగ్రెస్ పార్టీ చూపుతున్న ప్రేమ కేవలం సవతి ప్రేమ మాత్రమేనని, అది కపటంతో నిండిన మోసమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్ ప్రభాకర్ తీవ్ర విమర్శలు చేశారు. శనివారం నగరంలో ఓ హోటల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లతో బీసీలకు న్యాయం జరగదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గెల్లా సత్యనారాయణ, సన్నె ఉదయ్‌ప్రతాప్, తాండ్ర వినోద్‌రావు, నున్నా రవి, విజయరాజు తదితరులు ఉన్నారు.

ఇన్ఫోసిస్ సర్టిఫికేషన్స్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్‌బీఐటీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ సర్టిఫికేషన్స్‌లో జాతీయ స్థాయిలో ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ స్థానం పొందిదని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ కంపెనీతో ఎస్‌బీఐటీ కళాశాలకు ఉన్న అవగాహన ఒప్పందంలో భాగంగా కళాశాల విద్యార్థులకు అందించిన స్ప్రింగ్‌బోర్డు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలో కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందిన జంపాల సింధు అత్యధికంగా సర్టిఫికెట్స్ పొంది జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ద్వారా కోడింగ్ క్లాసుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. శనివారం కళాశాలలో విద్యార్థిని సింధుని ప్రత్యేకంగా అభినందించారు.

మూర్చతో పారిశుధ్య జవాన్ మృతి

ఖమ్మం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): విధులకు బయలుదేరిన నగరపాలక సంస్థ పారిశుధ్య జవాన్ మూర్చతో మృత్యువాత పడిన సంఘటనపై ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం నగరశివారు రామన్నపేటలో నివసించే బాసిపొంగు అజయ్ (32) నగరపాలక సంస్థ 47వ డివిజన్‌లో పారిశుధ్య జవానుగా పనిచేస్తున్నాడు. మున్నేరు వరద నేపథ్యంలో అతనికి అధికారులు శుక్రవారం రాత్రి పర్యవేక్షణ విధులు కేటాయించారు. అర్ధరాత్రి విధులకు బయలుదేరిన అతను ముత్యాలమ్మ గుడి వద్ద అస్వస్తతకు గురయ్యాడు. వెంటనే 34వ డివిజన్ జవాను గణపతికి ఫోన్ చేసిన అతను తనకు మూర్చ వస్తోందని, తాను ఉన్న ప్రదేశం చెప్పాడు. వెంటనే అక్కడకు చేరుకున్న గణపతి 108కు సమాచారం అందించి అతడిని ఆసుపత్రికి తరలించాడు. పరిక్షీంచిన వైద్యులు అప్పటికే అజయ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తల్లి విజయశోభ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఏఎస్‌ఐలుగా పలువురికి పదోన్నతి

ఖమ్మం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వహించి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్(ఏఎస్ఐ) పదోన్నతి పొందిన పలువురు పోలీసు అధికారులను శనివారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. ఉదోన్నతి పొందిన పోలీసులు సీహెచ్. నాగేశ్వరరావు, ఎస్. హర్యా, సీహెచ్. చంద్రశేఖర్, బి. కిషన్, యండి. ఖాజామొహీనుద్దీన్‌లను సీపీ అభినందించారు.



ఏఎస్‌ఐలను అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్



పాఠశాలకు వంట సామగ్రి వితరణ

వైరా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు(వైవీ) సహకారంతో వైరా మునిసిపాలిటీ ఏడోవార్డు ఫిషరీస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వంట సామగ్రిని, విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులను ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెలిశెట్టి నర్సింహారావు అధ్యక్షతన శనివారం వీటిని పంపిణీ చేశారు. జిల్లాలోని అనేక పాఠశాలలకు మౌలిక వసతులు సమకూర్చడంలో వైవీ చూపించిన చొరవను ఎంఈవో అభినందించారు. యలమద్ది వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు, ఏఏపీసీ చైర్మన్ రజిని, ఉపాధ్యాయుడు బి.రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా, రిటైర్డ్ టీచర్ కొండల్‌రావు పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

సత్తుపల్లిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విమర్శించడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సత్తుపల్లి పోలీసులకు కాంగ్రెస్ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. కేటీఆర్ మెప్పుకోసం ఇలాంటి నీచపు మాటలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఎన్నిక

వైరా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైరాలో ముస్లిం వెల్ఫేర్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్.కౌసర్, ఉపాధ్యక్షులుగా ఎండీ.యాదుల్‌ఖురేషీ, షేక్.బాబు, కార్యదర్శిగా ఎండీ.అన్వర్, జాయింట్ సెక్రటరీగా షేక్.బాబ్‌జానీ, కోశాధికారి, జాయింట్ కోశాధికారులుగా షేక్.రంజాన్, గౌసలతో పాటు మరో 18మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆసరా లేని నిరుపేద ముస్లిం కుటుంబాలకు కమిటీ అండగా ఉంటుందన్నారు. ముస్లిం పెద్దలు షేక్.వలీజాన్, మీరా, ఫిరోజ్, రెహ్మాన్, సయ్యద్, హతావుల్లా, నయీం, నిజాం పాల్గొన్నారు.

592వ రోజుకు 'మీల్స్ ఆన్ వీల్స్'

సత్తుపల్లిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో సత్తుపల్లి పరిసర ప్రాంతాలలో దాతల సహకారంతో చేపట్టిన మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం శనివారంతో 592వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆసుపత్రితోపాటు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో స్థానికులు అల్పాహారం పంపిణీ చేశారు. దాత మేడిది రమేష్, అనసూర్య దంపతుల కుమారుడు సాయిగిరిధర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని క్లబ్ బాధ్యులు తెలిపారు.

ఆక్రమిత భూమిని కాపాడాలి : సీపీఎం

మధిర రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం తొండలగోపవరం గ్రామపంచాయతీలోని తొర్లపాడు ఎస్సీ కాలనీ భూమి ఆక్రమణకు గురైందని, ఈ భూమిని సర్వే చేసి కాపాడాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆ గ్రామస్థులు మధిర తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీలోని సర్వేనెంబర్ 17లో ప్రభుత్వ పట్టా భూమి ఆక్రమణకు గురైందని సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు తహసీల్దార్‌కు వివరించారు. నాయకులు ప్రభాకర్, అమరయ్య, లాలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

ఎర్రుపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఆర్వీ కన్సల్టెన్సీ ప్రొప్రయిటర్ తోట కృష్ణశంకర్ రూ.10వేల విలువగల నోట్‌పుస్తకాలను శనివారం వితరణ చేశారు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు చేయూత నివ్వడం ఆనదంగా ఉందని దాత కృష్ణశంకర్ తెలిపారు. హెచ్ఎం జ్యోతి, గ్రామస్తులు సాంబశివరావు, జమలయ్య, శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు వత్సలాదేవి, లక్ష్మి, బాలకృష్ణ పాల్గొన్నారు.

గురుకులాలను సందర్శించిన తహసీల్దార్

మధిర రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కృష్ణాపురం వద్దగల ప్రభుత్వ బీసీ, ఎస్సీ గురుకుల పాఠశాలలు, కళాశాలను శనివారం మధిర తహసీల్దార్ రాంబాబు సందర్శించారు. గురుకులాల్లోని వసతులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు భారీగా కురుస్తున్నందున వివిధ సమస్యలు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుష్మా, కళాశాల అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. పెండింగ్ ఉన్న జీతాల కోసం, ఈఎస్ఐ, పీఎఫ్, తదితర చెల్లింపుల కోసం అడిగితే తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, యూనివర్సిటీలు, మునిసిపల్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఏజన్సీలు మనోవేదన చెందేలా చేస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా చలో కలెక్టరేట్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో తడికమళ్ల పుల్లారావు, పూచి రవి, ప్రవీణ్, సుధాకర్, సాంబయ్య, యశోద, పుల్లమ్మ, ఏసమ్మ పాల్గొన్నారు.

వంశరాజ్ కుల సంక్షేమ సంఘం మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా వినుకొండ

సత్తుపల్లిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వంశరాజ్ కులసంక్షేమ సంఘం మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా వినుకొండ వెంకటేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని వినుకొండకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ అందజేశారు.

మానవ వికాసానికి చదువే మార్గం

ఏన్కూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మానవ వికాసానికి చదువే మార్గమని ఆంధ్రా, తెలంగాణ , కర్ణాటక రాష్ట్రాల సుమధుర కన్‌స్ట్రక్షన్ సంస్థ అధినేత, పాఠశాలపూర్వ విద్యార్థి గుండా మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం ఏన్కూరు గురుకుల పాఠశాల 1983-84 పూర్వవిద్యార్థుల బ్యాచ్ పాఠశాలను సందర్శించింది. పాఠశాల ఆవరణలో ఆ బ్యాచ్ సభ్యులు మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో మధుసూదన్ కొద్దిసేపు ముచ్చటించి ప్రేరణ కలిగించారు. 600కోట్లు ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లిస్తూ 6వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ ఈ స్థాయికి ఎదగడం ఈ పాఠశాల గొప్పతనమే అని కీర్తించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ వే మురాజు, పూర్వవిద్యార్థులు సింగరేణి సంస్థ ఇంజనీర్ వేలాద్రి, హెచ్ఎం కృష్ణారావు, మువ్వా రవిబాబు, సాయి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కుటుంబరావు, లక్ష్మి, చైతన్య , పీఈటీ వీర పాల్గొన్నారు.



అభివృద్ధిలో పాలేరు వర్సెస్ సత్తుపల్లి

- జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదు
- రేషన్‌కార్డుల పంపిణీలో కలెక్టర్ అనుదీప్

సత్తుపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో సత్తుపల్లి నియోజకవర్గం పాలేరుతో పోటీపడుతూ ముందుకు సాగుతోందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం సత్తుపల్లి మండలం కొత్తూరులో లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి పంపిణీ చేశారు. సుమారు 20వేల రేషన్ కార్డులు జిల్లాలో జారీకాగా అన్ని మండలాల్లో పంపిణీ పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. కార్డులో చేర్చిన అదనపు కుటుంబ సభ్యులకు 6కేజీల సన్నబియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఈ విడతలో రానివారు ఆందోళన చెందవద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని, పెళ్లిలు అయినప్పుడు, పిల్లలు పుట్టినప్పుడు కొత్త రేషన్‌కార్డుల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రూ.10లక్షల పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో రాకపోతే అధైర్యపడొద్దని, అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లను ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని, వ్యవసాయేతర అంశాలకు యూరియాను డైవర్ట్ చేస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో సరిపడా యూరియా సరఫరా చేశామని, రెండుమూడు రోజులలో 3వేల మెట్రిక్ టన్నులు రానుందని, జిల్లా యంత్రాంగం రైతుల కోసం నిరంతరం పని చేస్తోందన్నారు.



రేషన్‌కార్డు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

పదేళ్ల స్వయంపాలనలో మంచిరోజు ఇదే : ఎమ్మెల్యే

పదేళ్ల స్వయంపాలనలో ఇదే మంచిరోజు అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. అర్హులైన పేదవాళ్లందరికీ అన్ని పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో నియోజకవర్గంలో 1100ఇళ్లు ఇచ్చారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలోనే 3500ఇళ్లు ఇవ్వగా.. అదనంగా 1500మంజూరు చేసిందని గుర్తుచేశారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో ఎస్‌బీఐ ఖాతాలు ఉన్నవారికే వెంటనే జమ అవుతున్నాయని, మిగతా బ్యాంకుల వారికి ఆలస్యమవుతుందని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కలెక్టర్‌కు వివరించగా పరిశీలిస్తామన్నారు. డీఎస్‌ఓ కే.చంద్రకుమార్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ కె.నరసింహా, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావుతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్థానిక'ంలో టీడీపీ సత్తా చాటాలి

వైరా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, తెలుగు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాపా కృష్ణమోహన్‌రావు తెలిపారు. వైరాలోని టీడీపీ కార్యాలయంలో కిలారి సురేందర్ అధ్యక్షతన శనివారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు ప్రసంగించారు. ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు చెరుకూరి చలపతిరావు, ఏన్కూరు మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, మండల నాయకులు ఆరెం రామయ్య, తాళ్లూరి అప్పారావు, జనార్థన్, జూలూరుపాడ్ మండల అధ్యక్షుడు కాటం రాజు, వైరా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లేపల్లి శ్రీనివాసరావు, గుండ్ల నాగేశ్వరరావు, అర్జున్‌రావు, గాలి రామకృష్ణ, పర్సా రామకృష్ణ, సూర్యదేవర వెంకటకృష్ణ, మందడపు మధుసూదన్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వాసిరెడ్డి రామనాథం

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

- పోలీసు కమిషనర్ సునీల్‌దత్

తల్లాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు శనివారం మండలంలోని గంగదేవిపాడు సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉండే విధంగా చర్యలుతీసుకోవడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా శనివారం గంగదేవిపాడు సొసైటీకి 15 టన్నులు యూరియా వచ్చింది. దీంతో మండల ఏవో ఎండీ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏఈవో ఆర్.త్రివేణి, సొసైటీ సీఈవో సరికొండ రాకేష్ రాజు యూరియా పంపిణీ కోసం 170మంది రైతులకు టోకెన్లను పంపిణీ చేశారు. టోకెన్లు తీసుకున్న రైతులు క్యూలో నిలబడగా యూరియా పంపిణీ చేశారు. యూరియా పంపిణీ కార్యక్రమాన్ని మార్క్‌ఫెడ్ జనరల్‌మేనేజర్, జిల్లాప్రత్యేకాధికారి విష్ణు మనోహర్, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్ పరిశీలించి గంగదేవిపాడు సొసైటీకి మరో 40టన్నుల యూరియా సరఫరా కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపినట్టు వారు వివరించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ అన్వర్‌పాషా, మండల మానిటరింగ్ అధికారి నాగేశ్వరి పాల్గొన్నారు.



పంపిణీని పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ జీఎం

పనులను పారదర్శకంగా పూర్తిచేయండి

- మండలంలో పర్యటించిన నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్

సత్తుపల్లిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో చేపడుతున్న ప్రభుత్వ పథకాలు, పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ సభ్యులు గరుడ, ఎస్.అశ్విన్‌గోపాల్ కోరారు. శనివారం మండలంలోని నారాయణపురం, కాకర్లపల్లి గ్రామాలలో మానిటరింగ్ టీమ్ పర్యటించింది. ఈ సందర్భంగా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలు, గ్రామ సంఘం సభ్యులతో పథకాల గురించి చర్చించారు. గ్రామసంఘాల రిజిస్టర్లు, ఉపాధి హామీ 7 రిజిస్టర్లు, గ్రామ పంచాయతీ రిజిస్టర్లను పరిశీలించారు. నారాయణపురంలో రోడ్ సైడ్ ప్లాంటేషన్, ఫీడర్ ఛానల్ పూడికతీత పనులు, హార్టికల్చర్ పామాయిల్ ప్లాంటేషన్ పనులు, కొత్తగా నిర్మాణమవుతున్న ఇళ్లను పరిశీలించారు. అదేవిధంగా కాకర్లపల్లిలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇంకుడుగుంతలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కల్లూరు సబ్ డివిజన్ అసిస్టెంట్ చలపతిరావు, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, ఈజీఎస్ ఏపీఓ ఎం.బాబుతో పాటు ఏపీఎం, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బంది, ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎల్ఎం టీమ్ సభ్యులు

కొండబాల సమావేశం

వైరా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని తన స్వగ్రామమైన కొండకొడిమ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరేందుకు సిద్ధమైన కొండబాల శనివారం కొండకొడిమలోని ముఖ్యనాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్‌లో చేరేందుకు తాను తీసుకున్న నిర్ణయాన్ని ఆయన నాయకులకు వివరించారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన తాను రాజకీయ నాయకుడిగా ఈ స్థాయిలో ఉండేందుకు గ్రామంలోని అన్నివర్గాల వారు తనకు ఎల్లవేళలా అండగా ఉన్నారని గుర్తుచేసుకున్నారు.

పెసర, పత్తి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కొణిజర్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొణిజర్లలో శనివారం కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, ఫణిశ్రీ, విజయ్ రైతులు సాగుచేసిన పత్తి, పెసర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వారు పలు సలహాలు, సూచనలు చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్నటువంటి వర్షాల కారణంగా పత్తిలో వేరుకుళ్లు, తెగులు ఆశించే అవకాశం ఉందని, అలా సోకితే రైతులు కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బెండిజం 1గ్రాము లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదల చుట్టూ నేలపై పోయాలని సూచించారు. పొలంలో నిలిచిన నీటిని బయటకు తీయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను 20 రోజుల నుంచి 40 రోజుల వయస్సున్న పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెంటిమీటర్ల దూరంలో పాదులు తీసి ఎరువులను వేసి మట్టితో కప్పాలని సూచించారు. ఇలా పలురకాల సూచనలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలాజీ, ఏఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అల్తాఫ్

చింతకాని, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తండా ఉండాలని చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అల్తాఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పల్లె దవాఖాన డాక్టర్లు, ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ లక్షణాలు, డ్రైడే, పరిశుభ్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో పర్వీన్ కైసర్, సీహెచ్‌వో వీరెందర్, సూపర్‌వైజర్లు కృష్ణారావు, నాగేశ్వరరావు, రేచల్‌రాణి, పల్లె దవాఖాన డాక్టర్లు అనిల్, వెంకటేశ్వరరావు, గ్రీష్మ, తబసుం మధుమయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాములు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సిబ్బంది అందరు స్థానికంగా ఉండాలని, సమయపాలన పాటించాలని ప్రతిరోజు డ్రైడే యాక్టివిటీస్‌చేయాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలనిసూచించారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

సత్తుపల్లిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపురి కాలనీ 7వ లైన్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు దాతలు మల్లూరి మార్కండేయులు, అచ్చమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. దాతలు, భక్తులు విరాళం ఇవ్వదలచిన వారు 9949424849 లో సంప్రదించాలని కోరారు.

గీతాజ్ఞానమందిరంలో తదియారాధన..

పట్టణ శివారులోని శ్రీ గీతాజ్ఞానమందిరంలోని శ్రీ పార్థసారథి స్వామి వారి దేవస్థానంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదియారాధనలో సందర్భంగా భక్తులతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌లో యాచకులకు ఆహార పొట్లాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

ఈజీఎస్ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి

వైరా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు ఉపాధి కూలీలందరికీ రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని వ్యకా.సం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండల వ్యకా.సం. మహాసభ తుమ్మల జాన్‌పాపయ్య అధ్యక్షతన వైరాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయ మహిళలకు రూ.12వేలు ఇవ్వాలని, 200రోజుల ఉపాధి పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, బడ్జెట్లో ఉపాధి హామీ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యకా.సం. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్ సహా 21మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, కారుమంచి జయరాజు, తాళ్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సంక్షేమంకోసం సమగ్ర చట్టం చేయాలని పేదలకే సంక్షేమ పథకాలు వర్తింప జేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో పులి కృష్ణయ్య, షేక్ నన్నేసాహెబ్‌ల అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ జరిగింది. ఈ మహాసభలో సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసే ప్రయత్నం చేస్తోందని, ఉపాధి కూలీలకు సరైన దినసరి వేతనం అందకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఉపాధి పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.3లక్షల కోట్లు కేటాయించి ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చొప్పున వేతనం ఇవ్వాలని కోరారు. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు జాజిరి శ్రీనివాసరావు, రైతుసంఘం జిల్లానాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చల్లా నాగేశ్వరరావు, ఆదూరి జీవరత్నం పాల్గొన్నారు. అనంతరం వ్యకాసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మన్నేపల్లి రామారావు, కార్యదర్శిగా పులి కృష్ణయ్యతో పాటు మరో 18మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఫొటోగ్రఫీలో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్

పెనుబల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఫొటోగ్రఫీలో రాణించేందుకు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్ అన్నారు. శనివారం పెనుబల్లి మండల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి సంఘం రాష్ట్ర సలహాదారు వేముల నర్సింహారావుతో కలిసి పాల్గొన్నారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గోదా శ్రీనివాసరావు, కల్లూరు అధ్యక్షుడు మోదుగు రాంబాబు, మండల ఉపాధ్యక్షులు అనంతోజు శ్రీనివాసరావు, మరకాల మధు, సహాయ కార్యదర్శి వేముల సీతరాములు, ప్రచార కార్యదర్శి పేరబత్తుల శ్రీనివాసరావు, సలహాదారులు గోదా శ్రీనివాసరావు, వత్సవాయి కనకాచారి, రమేష్ పాల్గొన్నారు.